# ఆధ్యాత్మిక వసంతం

ఉగాది ఉషస్సు ఒక్కరోజుకు పరిమితం కాదు! కొత్త ఏడాది రాకతో పలకరించే వసంతం రెండు నెలలు కొనసాగుతుంది. చైత్ర హాసం నెల రోజులు లాస్యం చేస్తుంది. ఈ వసంతంలో చిగురించే ఆధ్యాత్మిక శోభ నవరాత్రులూ భక్తి తరంగాలను ప్రసరింపజేస్తుంది. శరన్నవరాత్రులకు ఎంతటి ప్రాశస్త్యం ఉన్నదో.. చైత్ర శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు ఉండే... వసంత నవరాత్రులకూ అంతే ప్రాధాన్యం కనిపిస్తుంది.

మనం ఏడాదిలో మూడుసార్లు నవరాత్రులు చేసుకుంటాం. మొదటిది చైత్ర మాసంలో వచ్చే వసంత నవరాత్రులు. రెండోది భాద్రపదంలో వచ్చే గణేశ నవరాత్రులు. మూడోది ఆశ్వయుజంలో శరన్నవరాత్రులు. సంవత్సరంలో మొదటగా వచ్చే వసంత నవరాత్రుల్లో లలితాదేవి ఉపాసన చేసే సంప్రదాయం ఉంది. అంతేకాకుండా ఈ తొమ్మిది రోజులు శ్రీరామచంద్రుడి ఆరాధనలు విశేషంగా జరుగుతాయి. భద్రాచలంతోపాటు దేశవ్యాప్తంగా రామాలయాల్లో నవరాత్రులు, బ్రహ్మోత్సవాలు నిర్వహించడం కనిపిస్తుంది. శ్రీరామచంద్రుడు జన్మించిన నవమి నాడు.. సీతారాముల కల్యాణోత్సవాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహిస్తారు. సాధకులు ఈ తొమ్మిది రోజులు అధ్యాత్మ రామాయణం, సుందరకాండ పారాయణాలు చేస్తుంటారు. మరికొందరు భక్తులు రామకోటి రాస్తూ భక్తిని చాటుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో నిత్య సంకీర్తనం చేపడతారు. అమ్మవారి ఉపాసకులు లలితాదేవి ఉపాసన చేస్తారు. దేవీ నవరాత్రుల మాదిరిగా లలితాంబకు నిత్య అలంకారాలు, కైంకర్యాలు నిర్వహిస్తారు. 'శ్రీ రామో లలితాంబిక' అని పురాణాలు చెబుతున్నాయి. రామచంద్రుడిలో లలితాపరాభట్టారికను దర్శించి తరిస్తుంటారు.

రామాయణంలో కీలక ఘట్టాలు చైత్ర మాసంలో జరిగినట్టుగా తెలుస్తున్నది. శ్రీరాముడు జన్మించింది చైత్రంలోనే. రాముడు వనవాసానికి వెళ్లడం, దశరథుని నిర్యాణం, ఆంజనేయుడు సీతమ్మను లంకలో దర్శించిన సందర్భం, రామపట్టాభిషేకం తదితర ముఖ్యమైన ఘట్టాలన్నీ చైత్రంలోనే జరిగాయని పురాణ కథనాల ద్వారా తెలుస్తున్నది. ఇక చైత్ర పౌర్ణమి నాడు ఉత్తరాదిలో హనుమత్ జయంతి జరుపుకొంటారు. దక్షిణాదిలో హనుమత్ విజయోత్సవంగా చేసుకుంటారు. ఇలా ఎన్నో ప్రాధాన్యాలను ఇముడ్చుకున్న చైత్రం కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలికింది. మోడును కూడా చిగురింపజేసే వసంత రుతువు... మనుష్యులలో ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరియడానికి దోహదం చేస్తుంది అనడంలో సందేహం లేదు.

... శ్రీ




జిందగీ

# చింతన

నమస్తే తెలంగాణ హైదరాబాద్

సోమవారం 31 మార్చి 2025

www.ntnews.com

12




నేడు రంజాన్

# ఉనికిని చాటిన భావ వ్యక్తీకరణ

కార్పణ్య దోషోపహత స్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః
యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్‌।

(భగవద్గీత 2-7)

**'కృష్ణా!** నేను కార్పణ్య (పిరికితనము) దోషానికి లోనై, నా స్వభావానికి దూరమయ్యాను. ధర్మాధర్మ విచక్షణ జ్ఞానం లోపించి కర్తవ్యాన్ని నిర్ణయించుకోలేక పోతున్నాను. నేనిప్పుడు నీకు శిష్యుడిని. శిష్య వాత్సల్యతతో నాకేది శ్రేయస్కరమో దానిని ఉపదేశించు' అంటున్నాడు, అర్జునుడు. సర్వసమర్పణ భావనతో పార్థుడు తన సమస్యను పరమాత్మకు నివేదించాడు.

అర్జునుని మాటలు సమంజసంగా కనిపిస్తున్నా ధర్మబద్ధమైనవి కావు. భావోద్వేగాలకు లోనైన వేళ మనసు ఆవేశపూరితం అవుతుందే కాని ధర్మాన్ని గ్రహించదు. ప్రశాంతత నిలిస్తేనే విచక్షణ జ్ఞానం వెలుగుచూస్తుంది. పూర్వం ఎన్నో యుద్ధాలలో అర్జునుడు ప్రతివీరులను సంహరించాడు. దానితో వచ్చిన యశస్సును ఆస్వాదించాడు. అప్పుడు వ్యామోహం కలగలేదు. ఎందుకు? వారంతా పరాయివారు.. ఇప్పుడు ఎదురుగా నిలిచిన వారిని తన వారుగా భావిస్తున్నాడు. తనవారికొక ధర్మం, పరులకొక ధర్మమా? యుద్ధంలో తనవారు చనిపోతారు నిజమే కాని, యుద్ధం చేయకపోతే మాత్రం వారు శాశ్వతంగా జీవిస్తారా?

అర్జునుడి శక్తిసామర్థ్యాలను నమ్ముకొనే పాండవులు యుద్ధాన్ని కోరుకున్నారు. అర్జునుడు యుద్ధానికి భయపడి అస్త్రసన్యాసం చేయలేదు. భ్రమలో స్వజన సంహారమనే వ్యామోహానికి లోనై ఆ పనిచేశాడు. దుష్టశిక్షణ అనే కర్తవ్యాన్ని బాధ్యతతో నిర్వహించాల్సిన సమయంలో అర్జునునిలో క్లైబ్యత్వం (అధైర్యం) చోటుచేసుకున్నది. అర్జునుడు యుద్ధం చేస్తాడా, చేయడా.. కృష్ణుడికి అనవసరం. అర్జునుడి సమస్య మృత్యుభీతి. నిజానికి బాధ్యతారాహిత్యాన్ని సమస్యగా చూస్తున్నాడు. ఆ సమస్యను పరిష్కరించాలి.

అర్జునుడి మనస్సు ఇప్పుడు పూర్తిగా పరమాత్మ బోధను ఆకళింపు చేసుకునేందుకు సన్నద్ధమై ఉన్నది. ఆ సన్నద్ధతనే స్త్రీ శక్తిగా చెబుతారు. కృష్ణుడి మనసు ప్రశాంతమై బోధించేందుకు సన్నద్ధమై ఉన్నది.. దానినే పురుష శక్తిగా చెప్పుకొందాం. రెండూ ఒకదానికి మరొకటి అనుసంధానం కావడం వల్ల అక్కడ అయస్కాంత వలయం ఏర్పడి.. గురుశిష్యుల మధ్య భావ ప్రసరణ జరుగుతుంది. 'గురోః మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు ఛిన్న సంశయః' అన్నట్టుగా గురువు మౌనంగా వ్యాఖ్యానం చేస్తున్నాడు.. శిష్యుడు శ్రద్ధగా వింటున్నాడు. గురువనే ఉనికి నుంచి శిష్యుడనే ఉనికికి జ్ఞానం ప్రవహించింది. శిష్యుని అజ్ఞానం పటాపంచలైంది. ఏది కర్తవ్యమో దానిని బాధ్యతగా గుర్తించాడు. గురుశిష్యుల స్థాయి సమానం కావడం వల్ల బోధ శబ్ద రూపంలో జరగవలసిన అవసరం లేదు. కొంతమంది 700 శ్లోకాలు చెప్పేంతవరకు కౌరవ పాండవులు యుద్ధరంగంలో చూస్తూ కూర్చుంటారా? అంటారు. నిజమే కాని ఒక సూపర్ స్పెషలిస్ట్ మరొక సూపర్ స్పెషలిస్ట్ అనుమానాలను తీర్చే సమయంలో సాధారణ వ్యక్తికి తెలియజేసే విధంగా వివరించాల్సిన అవసరంలేదు. అలాగే పరిణతి చెందిన ఒక ఉనికి నుంచి పరిణతి చెందిన మరొక ఉనికికి ప్రవహించే జ్ఞానానికి ఎక్కువ సమయం పట్టకపోవచ్చు.



సాధారణమైన వ్యక్తి స్థూలంగా మతాచారాలను, వాటి నియమాలను, పూజాదికాలను అవగాహన చేసుకుంటాడు. సూక్ష్మంగా చూసే వ్యక్తి ఆ ఆచారాల ఆంతర్యాన్ని అవగాహన చేసుకుంటాడు. సూక్ష్మాతి సూక్ష్మంగా అవగాహన చేసుకునే వ్యక్తి ఆంతర్యానికి ఆవల ఉనికిని చూడగలుగుతాడు. స్థూలంగా చూడటం భౌతికం, సూక్ష్మంగా చూడటం మానసికం, సూక్ష్మాతిసూక్ష్మంగా పరిశీలించడం ఆత్మగా చెప్పుకోవచ్చు. అన్నిటికీ మూలాధారమైనది.. శ్రద్ధ మాత్రమే! ఆ శ్రద్ధ అర్జునునిలో పూర్ణంగా వికసించి గురువు బోధలను జాగ్రత్తగా ఆకళింపు చేసుకునేందుకు సన్నద్ధమయ్యాడు. భౌతికమైన, మానసికమైన, భావోద్వేగపరమైన పరిమితులు చెదిరిపోయాయి. యాంత్రికత కేంద్రంగా పనిచేసిన అర్జునుడి మనసు అయస్కాంత కేంద్రంగా మారింది.. పరివర్తన చోటుచేసుకున్నది. పిరికితనం, వ్యామోహం స్థానంలో కర్తవ్యం, బాధ్యతలు నిండిపోయాయి. నేను చేస్తున్నాననే భావన స్థానంలో తాను ఉపకరణం మాత్రమేననే సత్యం ఆవిష్కృతమమైంది.

... పాలకుర్తి రామమూర్తి

# రంజాన్ దీక్ష ఏడాదంతా

**కఠోర ఉపవాసాలు.. ఉదారంగా చేసే దానాలు.. పఠించే నమాజులు.. ఆచరించే నియమాలు.. అన్నిటి సమాహారం రంజాన్ మాసం. నియమబద్ధంగా గడిపిన నెల రోజుల దీక్ష రంజాన్ పండుగతో పరిపూర్ణం అవుతుంది. వ్యసనాలను త్యజించి, ఆకలి దప్పికలను సహించి అల్లాహ్ మెప్పు పొందే అద్భుత క్షణం ఈదుల్ ఫిత్ర్. ఇస్లాం సమాజం ఘనంగా జరుపుకొనే రంజాన్ పండుగ అందించే సందేశమిది...**

నెల రోజుల పాటు రోజంతా పస్తులు ఉండి చేసిన కఠోర దీక్షలు.. రాత్రుళ్లు గంటల తరబడి ప్రభువు ముందు చేసిన తరావీహ్ నమాజులు.. ఉన్నదాంట్లో బీదసాదలకు చేసిన దానాలు.. వీటన్నిటి ప్రతిఫలం లభించే రోజే 'ఈదుల్ ఫిత్ర్'. రంజాన్ మాసంలో నియమ నిష్ఠలతో దైవదూతలా జీవితం గడిపిన వారే పండుగ శుభాలకు అర్హులని ప్రవక్త బోధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈద్ రోజు ఇలాంటి విశ్వాసులు ఈద్గాహ్‌కు వెళుతుంటే స్వర్గలోకాల నుంచి దైవదూతలు దిగివచ్చి స్వాగతం పలుకుతారట. అత్యంత ప్రేమ, ఆప్యాయతలు కురిపిస్తూ శుభాకాంక్షలు తెలుపుతారట.

'ఓ అల్లాహ్ ప్రియదాసులారా! పదండి; మీరు పాటించిన ఉపవాసాలకు, రాత్రుళ్లు దైవారాధనలో నిల్చున్నందుకు, నెల సాంతం ప్రభువు విధేయతను చాటుకునేందుకు మీరు పడిన శ్రమకు ఈ రోజు మీకు బహుమానం దక్కుతుంది. ఇది మిమ్మల్ని సత్కరించే రోజు. మీ పాపాలను మన్నించి మిమ్మల్ని ప్రక్షాళనం చేసే రోజు' అని దైవదూతలు ఈద్గాహ్ వైపునకు వెళుతున్నంత సేపూ విశ్వాసులకు ఘనస్వాగతం పలుకుతారు. 'ఈ రోజు మీరు కోరుకున్నదల్లా ప్రసాదిస్తాను. మీరు నా పట్ల అలక్ష్యం, అవిధేయత చూపనంతకాలం నేను మీకు అనంతమైన అనుగ్రహ భాగ్యాలు అనుగ్రహిస్తాను' అని ఈద్ రోజున అల్లాహ్ ప్రకటన చేస్తాడు. 'మీరు నన్ను ప్రసన్నం చేసుకోవడంలో సఫలమయ్యారు. మీ ప్రయత్నాలన్నీ నాకెంతగానో నచ్చాయి. ఈరోజు నేను మీతో పూర్తిగా ప్రసన్నుడనయ్యాను' అనే శుభవార్త ఈద్ రోజు ప్రకటిస్తాడు. రంజాన్ పరమార్థాన్ని, రోజా ఉద్దేశాలను గ్రహించి రంజాన్ నెలను నియమబద్ధంగా గడిపిన వారికే ఈ శుభవార్త అని ప్రవక్త (స) చెప్పారు.

> **ఫిత్రా దానాలు ఎవరు చెల్లించాలి?**
>
> **ఫిత్రా** చెల్లింపు స్తోమత కలిగిన వారు తప్పనిసరిగా నెరవేర్చవలసిన బాధ్యత. ఇది నిరుపేదల హక్కుగా భావించి దానం చేయాలి. రంజాన్ రోజాలు పాటించిన వారే కాదు, పాటించలేకపోయినవారు సైతం తమ ఆర్థిక సామర్థ్యాన్ని బట్టి ఫిత్రా దానం చేయాలి. కుటుంబంలో ఎంత మంది సభ్యులు ఉంటే అంతమంది తరపున ఫిత్రా చెల్లించాలి. సుమారు పావు తక్కువ రెండు కిలోలు గోధుమలు కానీ లేక వాటికి సమానమైన ఖరీదుగల ఇతర ధాన్యం కానీ, డబ్బులు కానీ పేదలకు ఇవ్వాలి. ఈద్ నమాజు కంటే ముందు ఫిత్రా దానం చేయాల్సి ఉంటుంది. పండుగ సంతోషాల్లో నిరుపేదలూ పాలు పంచుకోవాలన్నది ఫిత్రా ఉద్దేశం.

రంజాన్ నెలను అలక్ష్యంగా, మనోవాంఛలను త్యజించకుండా మొక్కుబడిగా గడిపిన వారు ఈద్ శుభాలకు నోచుకోలేరన్నది ప్రవక్త ఉద్బోధ. చిల్లులు పడిన పాత్రతో నీటిని నింపడం సాధ్యమా? అలానే ఆంతర్యానికి పడ్డ మనోవాంఛలనే చిల్లులను మరమ్మతు చేసుకోకుండా చేసే దైవారాధనలైనా, ఉపవాసాలైనా బూడిదలో పోసిన పన్నీరవుతాయని ఖురాన్ పండితుల ఉద్బోధ. 'ఒక వ్యక్తి తిన్నంతనే వాంతి చేసుకుంటున్నాడు. అలాంటి వ్యక్తికి ఆ ఆహారం ఎలాంటి ప్రయోజనాన్ని, శక్తినీ కలిగించలేదు. అలాగే రంజాన్ నెలరోజుల ఉపవాసాల పరమార్థాన్ని పండుగ మరుక్షణమే త్యజిస్తే... ఆ నెల రోజుల శిక్షణ ఎలాంటి లాభమూ కలిగించదు' అంటారు ప్రముఖ ఇస్లామిక్ తత్వవేత్త మౌలానా మౌదూది. రంజాన్ పరమార్థాన్ని ఒంటపట్టించుకున్న వారే ఈద్ కానుకకు అర్హులని అల్లాహ్ శుభవార్త.



ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) పండుగ పూట సంబురాలు చేసుకునే బదులు తీవ్రంగా రోదించేవారట. ఉపవాసాలు, చేసిన దానధర్మాలు, నెలరోజుల పాటు చేసిన దైవారాధనలు అల్లాహ్ స్వీకృతిని పొందాయో లేదోనన్న ఆందోళనతో వెక్కివెక్కి ఏడ్చేవారట. ఉపవాసాల ఉద్దేశమైన 'తఖ్వా' దైవభీతి పెంపొందకపోతే ఉపవాసాలన్నీ వ్యర్థమైపోతాయి. ఎవరికైతే తఖ్వా దొరికిందో గొప్ప అనుగ్రహాన్ని, ఎనలేని విజ్ఞతను పొందినవారవుతారు. 'దారికి ఇరువైపులా ముళ్ల కంప ఉందనుకోండి! అలాంటి సమయంలో శరీరంపై ఉన్న వస్త్రాన్ని ఆ ముళ్లలో చిక్కుకోకుండా మన దుస్తులను దగ్గరికి తీసుకుని జాగ్రత్తగా ముందుకెళ్లడమే తఖ్వా' అంటారు హజ్రత్ ఉమర్ (రజి). తళుకుబెళుకుల ఈ మాయా ప్రపంచంలో మనోవాంఛలు గుర్రాల్లా పరుగెడుతాయి. వాటన్నిటి నుంచి మనల్ని మనం కాపాడుకోవడమే దైవభీతి అని ఆయన పేర్కొన్నారు. 'స్వర్గం రెండు అడుగుల దూరంలో ఉంది. ఒక అడుగు మనోకాంక్షలపై పెట్టు, రెండో అడుగు స్వర్గంలోనే ఉంటుంది' అని ప్రవక్త ఉద్బోధించారు. మనోకాంక్షలను కట్టడిచేయడానికి వచ్చిన రంజాన్ శిక్షణను ఎంతవరకు సద్వినియోగం చేసుకున్నామో ఈ పండుగ సందర్భంగా ఆత్మవిమర్శ చేసుకోవాలి. సముద్రంలో పడవ నీళ్లలో ప్రయాణిస్తున్నప్పటికీ చుక్కనీరును లోనికి రానివ్వదు. నీళ్లలో పడవ ప్రయాణిస్తున్నంతసేపూ ఆ ప్రయాణం సాఫీగా సాగుతుంది. పడవలో చేరితే ప్రాణాంతకమే. అలాగే మీరు ప్రపంచంలో ఉండండి. కానీ మీలోకి ప్రపంచాన్ని దరిచేరనివ్వకండి' అని అంటారు సూఫీలు. ప్రపంచమే సర్వస్వంగా ప్రేమించేవారి హృదయాల్లో దైవభీతి స్థానంలేదు. ఇలాంటి వారు చేసే సజ్దాలు, నమాజులు, ఉపవాసాలు మొక్కుబడిగా సాగుతాయి. ప్రపంచంలో ఒక బాటసారిలా జీవితాన్ని గడపాలన్నది ప్రవక్త ఉద్బోధ.

> **ఫిత్రా దానాలు..**
>
> **'ఫిత్ర్'** అంటే ఉపవాస వ్రతాలను విరమించడం. రంజాన్ ఉపవాసాలను పూర్తి చేసిన సందర్భంగా స్తోమత కలిగిన ప్రతీ ముస్లిమ్ పురుషుడు, స్త్రీ సంతోషంగా పేదలకు కొంత దానాన్ని అందజేయవలసి ఉంటుంది. రంజాన్ పండుగకు ముందు చేసే దానాన్ని ఫిత్రా దానం అంటారు. ఇది పాపాల పరిహారంగా ఉపయోగపడుతుంది. 'ఉపవాస వ్రత సమయంలో పొరపాటున మన నోట పనికిమాలిన మాటలు వెలువడవచ్చు. అదీగాక అనాలోచితంగా, అసంకల్పితంగా మన హృదయంలో చెడు తలంపులు కూడా వస్తుంటాయి. అందువల్ల దైవ ప్రవక్త (స) ఫిత్రా దానాన్ని (మనకు) విధిగా నిర్ణయించారు. ఫిత్రా దానం వల్ల ఉపవాసాలు పరిశుద్ధమవుతాయి. వేరొకవైపు ఈ దానం వల్ల పేదవాళ్లకు కూడు, గుడ్డ లాంటి ప్రాథమిక అవసరాలు నెరవేరుతాయి' అని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ ఊద్ (రజి) ఫిత్రా ప్రాముఖ్యాన్ని వివరించారు.

రంజాన్ నెల రోజులూ ఉపవాసాలు పాటించాం, దైవారాధనలు చేశాం, జకాత్, సదకా, ఫిత్రాల ద్వారా పేదలను ఆదుకున్నాం. ప్రేమ, సహనం, సానుభూతితో పరస్పరం మెలిగాం. ఒకరి తప్పులను మరొకరు పెద్దమనసుతో మన్నించుకున్నాం. అబద్ధం, అవినీతి, చెడుచూపు, వ్యర్థ ప్రేలాపనలన్నిటినీ త్యజించాం. నెల రోజులపాటు మంచి సాంగత్యంలో జీవితం గడిపాం. మంచికి మారుపేరుగా నిలిచాం. ఈద్ తర్వాత కూడా ఇదే కొనసాగిస్తేనే రంజాన్ శిక్షణకు సార్థకత ఏర్పడుతుంది. రంజాన్ మాసంలోనే నమాజులు చేసిన వారు మిగతా 11 నెలలూ ఐదు పూటలా నమాజ్ చేయాలనే సంకల్పం చేసుకోవాలి. బతికున్నంత కాలం నమాజ్‌ను వీడనని ప్రతిజ్ఞ చేసుకోవాలి. రంజాన్‌లో జకాత్ దానాలు చేసిన వారు మిగతా రోజుల్లోనూ దానధర్మాలను కొనసాగించాలి. సంపదలో నుంచి జకాత్ దానాన్ని పేదలకు పంచిపెట్టే ప్రేరణను కొనసాగించాలి. రంజాన్‌లో ఏవిధంగానైతే మోసం, దగా, అబద్ధం, వాగ్దాన భంగం, కల్తీకి పాల్పడటం, లంచం, అవినీతి లాంటి చెడు గుణాలను త్యజించారో.. జీవితంలో ఎప్పుడూ వాటి జోలికి వెళ్లబోమని గట్టి సంకల్పం చేసుకోవాలి. మొత్తంగా ఈ రంజాన్ మాసంలో శ్రీకారం చుట్టిన మంచిపనులను జీవితాంతం ఆచరిద్దాం.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076

కథాసుధ

# ఉప్పు నీళ్లు



**ఓ** ఎండకాలం సాయంత్రం ఆశ్రమానికి ఒక వ్యాపారి వచ్చాడు. తన వ్యాపారం మరింత బాగా జరిగేట్లు, అధిక లాభాలు గడించేట్లు గురువును దీవించమన్నాడు. ఆ మాటల్లో వ్యాపారి అత్యాశాపరుడని తెలుసుకున్నాడు గురువు. అలాగేనని చెప్పి వ్యాపారిని మొదట ఆశ్రమమంతా తిరిగి రమ్మన్నాడు. విశాలమైన ఆశ్రమం అంతా తిరిగి అలసిపోయిన వ్యాపారి గురువు దగ్గరికి వచ్చి బాగా దాహంగా ఉందన్నాడు. సేవకులకు చెప్పి ఉప్పు నీళ్లు ఇప్పించాడు గురువు. వాటిని తాగిన వ్యాపారి, దాహం తీరలేదన్నట్టుగా ముఖం పెట్టాడు. అతడి వాలకం చూసి మరో గ్లాసు ఉప్పు నీళ్లు ఇచ్చారు సేవకులు. ఆశగా చేతిలోకి తీసుకుని వాటిని కూడా తాగేశాడు వ్యాపారి. మరింత బాధగా ముఖం పెట్టి 'ఇంకా దాహంగా ఉంది' అన్నాడు. మళ్లీ గ్లాసు ఉప్పు నీళ్లు ఇవ్వమని సేవకులకు చెప్పాడు గురువు. 'ఉప్పు నీళ్లు వద్దు, మంచి నీళ్లు ఇవ్వండి' అని కోరాడు వ్యాపారి. 'ఎందుకు ఉప్పు నీళ్లు వద్దంటున్నార'ని ప్రశ్నించాడు గురువు. 'ఉప్పు నీళ్లు ఎన్ని తాగినా దాహం తీరదు. కాబట్టి మామూలు నీళ్లు ఇవ్వండి' అని ప్రాధేయపడ్డాడు వ్యాపారి. అతను కోరినట్టే మంచినీళ్లు ఇప్పించాడు గురువు. ప్రతి నీటి చుక్కనూ చప్పరిస్తూ తృప్తిగా తాగి 'హమ్మయ్య... ఇప్పుడు దాహం తీరింది!' అన్నాడు వ్యాపారి. చిన్నగా నవ్విన గురువు 'ఉప్పు నీళ్లు దాహం తీర్చవని గుర్తించావు కాని, ఎంత సంపాదించినా మన ఆశా దాహం తీరదని గుర్తించలేకపోతున్నావు. సంపాదించే కొద్దీ ఇంకా.. ఇంకా కావాలనిపిస్తుంది. దానికి అంతే ఉండదు' అన్నాడు. 'బాగా సంపాదిస్తేనే కదా వస్తువులను సొంతం చేసుకోగలం. సుఖాలను అనుభవించగలం' అన్నాడు వ్యాపారి. 'బాగా సంపాదిస్తే వస్తువులను సొంతం చేసుకోవచ్చని అనుకుంటున్నావు. ప్రశాంతంగా ఆలోచించి చూడు. ఆ వస్తువులే మనల్ని సొంతం చేసుకుంటున్నాయని గుర్తిస్తావు. ఆనందం అనేది వస్తువుల నుంచి రాదు. అది మనలో నుంచే వస్తుంది' అని బదులిచ్చాడు గురువు. 'సంపద మాయలో పడి జీవిత సత్యాన్ని మరచాను' అని గుర్తించి అక్కడినుంచి కదిలాడు వ్యాపారి.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు,
93936 62821

క్రీస్తు సందేశం

# మహాశిల్పి



**ఈ** సృష్టి ఆవిర్భావంతో మానవుడికి ఎటువంటి అధికారిక బంధం లేకున్నా, ఎన్నెన్నో అద్భుతాలు చేయగలుగుతున్నాడు. అయితే, ఈ మనిషి దారి తప్పినప్పుడు.. ఆ దేవుడు సరిదిద్దలేడా? ఈ బొమ్మలకు రంగులు వేసి, అలంకరించి ప్రయోజకులుగా తీర్చిదిద్దలేడా? అవును ఆయన మహాశిల్పి. అంత పనీ చేయగలడు. అదే ఆయన శిల్పచాతుర్యం. మనం మనుషులం. ఎటైనా మళ్లించుకోవడానికి అనువైన బంకమట్టితో సమానులం. ఇదే విషయం బైబిల్‌లోని పాత నిబంధనలో ఇర్మియా సంఘటన ద్వారా తెలుస్తుంది. ఇర్మియా ఒక ప్రవక్త. తన ఇరవయ్యో ఏట నుంచీ దైవ మార్గంలో ప్రయాణిస్తూ ఉన్న భక్తుడు. దేవుడి వాక్కు అందరికీ పంచాల్సిన సమయం వచ్చింది. 'దేవుడు తన బిడ్డల్ని తనవైపు మళ్లించుకుంటాడా' అనే సందేహాలతో, ఆందోళనలతో ఇర్మియా మనసు డోలాయమానంలో పడింది. ఆ సమయంలో దైవవాక్కు వినిపించింది. అతణ్ని ఒక కుమ్మరి ఇంటికి వెళ్లమన్నది. దైవాదేశాన్ని గౌరవించి ఇర్మియా.. కుమ్మరి ఇంటికి వెళ్లాడు. అక్కడ సారె మీద మట్టితో పని చేస్తున్నాడు కుమ్మరి. జిగట మన్ను తీసుకొని తనకు కావలసిన రీతిలో దాన్ని మలుస్తూ కనిపించాడు. చిగురు గోటితో అతిసున్నితంగా వయ్యారంగా పాత్రలు తీర్చిదిద్దుతున్నాడు. తన అధీనంలో ఉన్న సారె వేగాన్ని తగ్గిస్తూ, పెంచుకొంటూ కుండలను తయారు చేస్తున్నాడు. ఇర్మియాకు కుమ్మరి చేసిన శిల్పంలో దేవుడి శక్తిసామర్థ్యాలూ స్మరణకు వచ్చాయి. ఆ కుమ్మరి తానే అన్నట్టుగా దేవుడి అంతరార్థం వినిపించింది. దేవుడు చేయనున్న అద్భుతమూ గుర్తుకు వచ్చింది. తన కర్తవ్యం బోధపడింది.

... ప్రొ॥బెర్నార్డ్ రాజు, 98667 55024